Follow: @ANNTELUGU
REGISTERED NUMBER APTEL/2014/58382
22-05-2026
ANN తెలుగు
మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 304 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD శుక్రవారం WWW.EPAPER.MAHAADAILY.COM



## ఆధునిక భారత నిర్మాతకు ఘన నివాళి


- రాజీవ్ స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రగతి
- మహిళా రిజర్వేషన్ల కోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలి
- ప్రధానికి సీఎం రేవంత్ డిమాండ్
- సచివాలయం ఎదుట మహానేత విగ్రహానికి అంజలి
- దేశ సమగ్రత కోసం రాజీవ్ ప్రాణత్యాగం

02

టాప్ న్యూస్

## నేను ఢిల్లీకి రాగానే జైలుకు పంపుతారేమో

- కాక్రోచ్ పార్టీ ఫౌండర్
- 5 రోజుల్లోనే ఇన్స్టాలో 1.4 కోట్లకు పైగా ఫాలోయర్లు



02

## మొదటి రెండు స్థానాల్లో అంబానీ, అదానీ


- టాప్ టెన్ బిలియనీర్లు వీరే,...



02

## యూపీలో మళ్ళీ బీజేపీనే...

- యాక్సిస్ మై ఇండియా అధినేత ప్రదీప్ గుప్తా



03

## మావిగన్ అంటే.. బాబుకు గుండె ఆగేలా ఉంది

- తప్పులను ప్రశ్నిస్తే బీపీ పెరుగుతోంది
- మా తాతను చంపింది టీడీపీ కాదా?
- వైసీపీ అధినేత జగన్ ఫైర్



**తాడేపల్లి:** చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండటం ఏపీ చేసుకున్న దురదృష్టమని వైసీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. ఏపీకి రాజధాని లేకుండా చేస్తున్నారని, మావిగన్ అంటే బాబుకు గుండె ఆగిపోయేలా ఉందన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..'చంద్రబాబు కారణంగా ఏపీ ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఇచ్చిన హామీలకు వెన్నుపోటు పొడిచారు. అమరావతిలో రోడ్లు, నీరు, డ్రైనేజీ, మౌలిక సదుపాయాలకే రూ.2లక్షల కోట్లు ఖర్చు అవుతుంది. ఆచరణ మిగతా 2లో

# కేటీఆర్ మనిషివేనా?



## మైనర్ బాలికను అడ్డం పెట్టుకుని శాడిజం ఏంటి?

తన బావమరిదిని అరెస్ట్ చేయమని ఎందుకు చెప్పలేదు?

సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు

కేటీఆర్, ఆర్ ఎస్ ప్రవీణ్ జడ్జీలా తీర్పునిస్తున్నారు



**హైదరాబాద్, మహా :** భగీరథ్ అంశంలో కేటీఆర్ మనిషిలా ప్రవర్తించడం లేదంటూ సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేటీఆర్‌కు రాజకీయాలు కావాలంటే రాజకీయంగా కొట్లాడాలన్నారు. అంతే తప్ప ఒక మైనర్ బాలికను అడ్డం పెట్టుకుని రాజకీయంగా ఏదో సాధించామనే ఈ శాడిజం ఏంటి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేటీఆర్ బావమరిది ఫామ్ హౌస్‌లో నేరుగా డ్రగ్స్ తీసుకుంటూ దొరికిపోతే ఆ సమయమంలో తన బావమరిదిని అరెస్టు చేయాలని ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. అదే పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్సీ కోడిపందేలు నిర్వహిస్తూ దొరికిపోయాడు. దుబాయ్‌లో చనిపోయిన టాలీవుడ్ నిర్మాత కేదార్ మిత్రుడు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఫామ్ హౌస్ లో డ్రగ్స్ పార్టీ చేసుకుంటూ పోలీసులపై కాల్పులు జరిపారు. ఆ నాడు కేటీఆర్ ఏ బొక్కలో పడుకున్నాడని సీరియస్ అయ్యారు. చట్టాన్ని గౌరవిస్తామని చెబుతున్న కేటీఆర్ వారిని ఎందుకు పార్టీ నుంచి సస్పెండ్ చేయలేదని ప్రశ్నించారు. ఇంత కంటే సిగ్గుతప్పి ఎవరైనా మాట్లాడుతారా అని నిలదీశారు. డ్రగ్స్ కేసులో దొరికిన కేటీఆర్ బావమరిదికి నోటీసులు ఇచ్చారని పోక్సో కేసులో బండి భగీరథ్‌కు కూడా పోలీసులు నోటీసులు ఇచ్చారన్నారు. నోటీసులు ఇచ్చాక భగీరథ్ తరపున సమయం కోరారని, బాలిక మైనరా కాదా అనే విషయంలో ప్రభుత్వ సమాచారం సేకరించామన్నారు. అమ్మాయి మైనర్ అని నిర్ధారించుకున్నాక వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకుందని ప్రభుత్వ చర్యలను కోర్టు తప్పుపట్టలేదన్నారు.

### పద్ధతి ప్రకారమే పోలీసు దర్యాప్తు


బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో పోలీసులు పద్ధతి ప్రకారం దర్యాప్తు మిగతా 2లో




## బ్లాక్ టికెట్ మాఫియా

- ఉప్పల్ లో నేడు ఎస్ ఆర్ హెచ్ వర్సెస్ ఆర్ సీబీ ఫైట్
- హై వోల్టేజ్ మ్యాచ్ పై అభిమానుల్లో ఫుల్ క్రేజ్
- టికెట్ బుకింగ్స్ పై అభిమానుల్లో అనుమానాలు
- రంగంలోకి పోలీసులు.. 10 కేసులు నమోదు

**హైదరాబాద్ సిటీ, మహా :** ఈ ఐపీఎల్ సీజన్ లో హైదరాబాద్ లో జరుగుతున్న ఆఖరి మ్యాచ్ కు బ్లాక్ మార్కెట్ చీడ అంటుకుంది. ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా శుక్రవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరగనున్న హైవోల్టేజ్ మ్యాచ్‌కు ముందే బ్లాక్ టికెట్ల దందా జరుగుతోంది. ఈ మ్యాచ్‌కు సిటీలో భారీ క్రేజ్, డిమాండ్ నెలకొన్న నేపథ్యంలో.. టికెట్లను అక్రమంగా మళ్లించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో టికెట్ల అమ్మకాలు మిగతా 2లో





## కార్యకర్తే అధినేత

- కార్యకర్తే అధినేత
- టీడీపీ మహానాడుపై బాబు సమీక్ష

**అమరావతి, మహా :** టీడీపీ మహానాడు ఏర్పాట్లపై పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం పొలిట్‌బ్యూరో సమావేశం జరిగింది. మే 27, 28 తేదీల్లో హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించనున్న ఈ కార్యక్రమ అజెండాపై నేతలకు చంద్రబాబు కీలక దిశానిర్దేశం చేశారు. హైబ్రిడ్ విధానంలో నిర్వహించే మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం కోసం రూపొందించిన 19 తీర్మానాలకు పొలిట్‌బ్యూరో ఆమోదం తెలిపింది. ఉండవల్లిలోని తన నివాసం నుంచి చంద్రబాబు వర్చువల్‌గా పాల్గొనగా, ఇతర మిగతా 2లో


## కార్మికులకు సీఎం గుడ్ న్యూస్

కనీస వేతనాలు భారీగా పెంపు

- మూడు జోన్లుగా వేతనాల నిర్ణయం
- త్వరలో గల్ఫ్ పాలసీ
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు



02





## ఎబోలా కలకలం.. దేశంలో హైఅలర్ట్

- ఆఫ్రికా ప్రయాణికులకు కేంద్రం కీలక మార్గదర్శకాలు.
- ఎబోలా ఎఫెక్టో భారత్-ఆఫ్రికాసదస్సు వాయిదా.
- గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన డబ్ల్యూహెచ్ఓ
- విమానాశ్రయాల్లో కట్టుదిట్టమైన నిబంధనలు.

02

## కాళేశ్వరంలో సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభం

- తొలి పుణ్యస్నానం ఆచరించిన కంచి పీఠాధిపతి, మంత్రులు
- పోటెత్తిన భక్తులు.. 12రోజుల్లో 30లక్షల మంది వస్తారని అంచనా



02

## హైదరాబాద్ ఎంఎంటీఎస్‌కు మహర్దశ

- తెలంగాణ రైల్వే ప్రాజెక్టులపై కేంద్రం స్పెషల్ ఫోకస్
- మౌలిక వసతుల పెంపుపై రైల్వే మంత్రి సానుకూల స్పందన
- రాష్ట్రంలో 42 ప్రధాన రైల్వే స్టేషన్ల అభివృద్ధి
- హైస్పీడ్ కారిడార్ల పురోగతిపై సమగ్ర సమీక్ష
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక భేటీ

02







# కేటీఆర్ మనిషివేనా?

( మొదటి పేజీ తరువాయి )

చేస్తున్నారని ఫిర్యాదు వచ్చిన వెంటనే భగీరథ్ కేసులో చర్యలు తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భగీరథ్ లొంగిపోలేదని పోలీసులు అతడిని అరెస్టు చేశారని స్పష్టం చేశారు. తనిఖీల్లో బండి భగీరథ్ దొరికాడని పోలీసులు చెప్పారని నేను పోలీసుల మాటలనే నమ్ముతున్నానని చెప్పారు. గురువారం సచివాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జడ్జీలుగా మారి తీర్పులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోక్సో కేసులో బాధితుల వివరాలు బహిర్గతం చేయకూడదని కానీ వీరు మైనర్ అమ్మాయిని అడ్డు పెట్టుకుని రాజకీయం చేస్తున్నారు. బీఆర్ఎస్ నేతల మాదిరిగా రోడ్డుమీద పడి మాట్లాడితే బాధిత కుటుంబం ఆవేదన ఎలా ఉంటుందని ప్రశ్నించారు. ఇంత జరుగుతుంటే ప్రతిపక్ష నాయకుడు ఎక్కడ నిద్రపోతున్నాడని ప్రశ్నించారు. కేసీఆర్ కు బయటకు వచ్చి మాట్లాడేందుకు శక్తి లేకపోతే ఒక ప్రెస్ నోట్ అయినా ఇవ్వొచ్చు కదా అని ప్రశ్నించారు. పక్క పార్టీ నుంచి నేత వస్తే జగిత్యాల వరకు వెళ్లి వచ్చిన కేసీఆర్ రాష్ట్రంలో ఇంత మేజర్ ఇన్సిడెంట్ జరిగితే ప్రధాన ప్రతిపక్ష నాయకుడు స్పందించకుండా ఎటుపోయారు అని నిలదీశారు.

**కేటీఆర్‌కు బండికి మధ్య ఏదో పంచాయతీ**

ఏ కేసులోనైనా ప్రభుత్వం చట్ట ప్రకారమే నడుచుకుంటుందని సీఎం స్పష్టం చేశారు. డ్రగ్స్ తీసుకున్న వారిని బాధితులుగా చూడాలని చట్టం చెబుతోందన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికితే జైలుకు పంపిస్తున్నాం. అదే డ్రగ్స్, గంజాయి తీసుకుంటూ దొరికితే బాధితుడిగా చెబుతూ స్టేషన్ బెయిల్ ఇవ్వాలని చట్టంలో ఉంది. ఇప్పుడు ఏం చేయాలో మీరే చెప్పాలన్నారు. ఈ చట్టాల్లో ఉన్న లొసుగులను కేటీఆర్ ఆయన బావమరిది ఉపయోగించుకుంటున్నారని ఈ చట్టాలను సవరించాల్సిన అవసరం ఉందన్నారు. బండి భగీరథ్ కేసు చాల సున్నితమైన కేసు అని ఇందులో కేసు నమోదు చేసిన సెక్షన్లు, అరెస్టు, రిమాండ్, కోర్టులో మా వాదనలో ఎక్కడైనా లోపముందా అని ప్రశ్నించారు. కేటీఆర్ కు బండి సంజయ్ కు ఏదో పంచాయతీ ఉందని దాన్ని పిల్లల మీద పెట్టి పగ సాధించాలనుకుంటే ఎట్లా అన్నారు. సమావేశంలో మంత్రి వివేక్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ యాదవ్, విప్ విజయరమణారావు, వేముల వీరేశం, రాజ్ ఠాకూర్, మందుల సామేలు పాల్గొన్నారు.

# కార్మికులకు సీఎం గుడ్ న్యూస్

- కనీస వేతనాలు భారీగా పెంపు
- మూడు జోన్లుగా వేతనాల నిర్ణయం
- త్వరలో గల్ఫ్ పాలసీ
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు



**హైదరాబాద్, మహా :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోట్లాది మంది కార్మికులకు భారీ ఊరటనిస్తూ కనీస వేతనాల పెంపును అధికారికంగా ప్రకటించారు. కేబినెట్ సబ్ కమిటీ నివేదిక, సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం వల్ల రాష్ట్రంలో దాదాపు 1.11 కోట్ల మంది కార్మికులకు ప్రత్యక్షంగా మేలు జరుగుతుందని సీఎం వెల్లడించారు. ఈ సవరించిన నూతన వేతనాలు వచ్చే జూన్ 1వ తేదీ నుంచే అమల్లోకి రానున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత పదేళ్ల కేసీఆర్ హయాంలో కార్మికుల కనీస వేతనాలను నిర్ణయించడంలో ఘోరమైన నిర్లక్ష్యం వహించారని, తద్వారా 1.11 కోట్ల మంది శ్రామికులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అందుకే అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఈ వేతనాల సవరణ ప్రక్రియను పూర్తి చేశామని చెప్పారు. అలాగే, గల్ఫ్ దేశాలకు వలస వెళ్లే కార్మికుల రక్షణ కోసం త్వరలోనే ఒక అద్భుతమైన 'గల్ఫ్ పాలసీ'ని తీసుకురాబోతున్నామని, ప్రస్తుతం గల్ఫ్ వెళ్లేవారి బాధ్యతను ప్రభుత్వమే చూసుకుంటోందని భరోసా ఇచ్చారు.

**మూడు కేటగిరీలుగా వేతనాలు**

వేతనాల సవరణ కోసం మంత్రివర్గ ఉపసంఘం రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించింది. జోన్ 1 పరిధిలోకి మున్సిపల్ కార్పొరేషన్లు, జోన్2 కింద మున్సిపాలిటీలు, జోన్3 కింద గ్రామీణ ప్రాంతాలను చేర్చారు. అలాగే కార్మికులను వారి నైపుణ్యాల ఆధారంగా అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హై స్కిల్డ్ అనే నాలుగు కేటగిరీలుగా విభజించారు.

**ప్రధాన నగరాలు, కార్పొరేషన్లు ఉన్న జోన్-1 పరిధిలో పెరిగిన కొత్త వేతనాల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:**

**అన్‌స్కిల్డ్ (నైపుణ్యం లేని) కార్మికులు:** వేతనం రూ.12,750 నుంచి రూ.16,000 కు పెంపు.

సెమీ స్కిల్డ్ (పాక్షిక నైపుణ్యం గల) కార్మికులు: వేతనం రూ.13,592 నుంచి రూ.17,000 కు పెంపు.

స్కిల్డ్ (నైపుణ్యం గల) కార్మికులు: వేతనం రూ.13,772 నుంచి రూ.18,500 కు పెంపు.

హై స్కిల్డ్ (అధిక నైపుణ్యం గల) కార్మికులు: వేతనం రూ.14,607 నుంచి రూ.20,000 కు పెంపు.

**ఏఐపై సీఎం సూచనలు**

మారుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో యువత చదువులు, ఉద్యోగాలపై సీఎం కీలక సూచనలు చేశారు. కేవలం డిగ్రీలు పూర్తి చేసి, ఉద్యోగం లేదా ఉపాధి లభించని చదువులు వ్యర్థమని స్పష్టం చేశారు. ఏఐ సాంకేతికత ఎంత వేగంగా విస్తరించినప్పటికీ.. అది కేవలం వైట్ కాలర్ ఉద్యోగాలకే ముప్పని, శారీరక శ్రమతో కూడిన 'బ్లూ కాలర్' ఉద్యోగాలకు ఎలాంటి ఢోకా ఉండదని భరోసా ఇచ్చారు. జర్మనీ, జపాన్, సింగపూర్ వంటి విదేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, రాష్ట్ర యువత నైపుణ్యాలు పెంచుకుంటే విదేశాల్లో రూ.2 లక్షల వరకు వేతనం పొందవచ్చని, ఇందుకోసం ప్రభుత్వం అవసరమైన ప్రోత్సాహకాలను అందిస్తోందని తెలిపారు. సమావేశంలో కార్మికశాఖా మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ యాదవ్, విప్ విజయరమణారావు పాల్గొన్నారు.



# కార్యకర్తే అధినేత

మొదటి పేజీ తరువాయి

నేతలు మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్ నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉదయం 9 గంటల నుంచే కార్యక్రమాలు ప్రారంభించాలని, ప్రతి వక్త తమకు కేటాయించిన అంశంపైనే సూటిగా, స్పష్టంగా మాట్లాడాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. పార్టీకి మహిళలు, బీసీలు రెండు కళ్ల లాంటివారని పునరుద్ఘాటించారు. "మహిళలకు టీడీపీ ఇస్తున్న ప్రాధాన్యాన్ని అందరికీ అర్థమయ్యేలా చాటాలి. జనాభాలో 50 శాతం ఉన్న బీసీలు పార్టీ ఆవిర్భావం నుంచీ మనకు వెన్నుదన్నుగా ఉన్నారు. వారి అభివృద్ధికి పార్టీ కట్టుబడి ఉందనే సందేశం స్పష్టంగా వెళ్లాలి" అని నేతలకు సూచించారు. "కార్యకర్తే అధినేత" అనే నినాదం మహానాడులో స్పష్టంగా ప్రతిబింబించాలని, పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంకును జాగ్రత్తగా కాపాడుకోవాలని స్పష్టం చేశారు.

# బ్లాక్ టికెట్ మాఫియా

మొదటి పేజీ తరువాయి

ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే 'సోల్డ్ అవుట్' అని బోర్డులు పెట్టడంపై అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈసారి జొమాటో, డిస్ట్రిక్ యాప్స్ ద్వారా జరిగిన అధికారిక టికెట్ బుకింగ్స్‌పై పబ్లిక్‌లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని ముఠాలు ముందుగానే ఒక ప్రణాళిక ప్రకారం భారీ సంఖ్యలో టికెట్లను కొనుగోలు చేసి, వాటిని బ్లాక్ మార్కెట్‌కు మళ్లించారని క్రికెట్ ఫ్యాన్స్ ఆరోపిస్తున్నారు. సాధారణ ధరలకు లభించాల్సిన టికెట్లను సామాజిక మాధ్యమాల్లో, స్టేడియం వెలుపల పలువురు ఎక్కువ ధరలకు విక్రయిస్తుండటంతో, నిజమైన క్రీడాభిమానులు మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశాన్ని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా కూడా ఈ టికెట్ల అవకతవకలపై పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఉప్పల్ మ్యాచ్ టికెట్ల బ్లాక్ మార్కెట్ వ్యవహారంపై మల్కాజ్‌గిరి పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. స్టేడియం పరిసరాల్లో రహస్యంగా తనిఖీలు చేపట్టిన పోలీసులు.. అక్రమంగా టికెట్లు విక్రయిస్తున్న వారిపై ఇప్పటివరకు 10 కేసులు నమోదు చేసినట్లు అధికారికంగా ప్రకటించారు. శుక్రవారం మ్యాచ్ ప్రారంభమయ్యే వరకు స్టేడియం పరిసర ప్రాంతాలతో పాటు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియా అకౌంట్లపై ప్రత్యేక విభాగాంతర నిఘా కొనసాగుతుందని పోలీసులు స్పష్టం చేశారు. ఎవరైనా టికెట్లను అక్రమంగా నిల్వ చేసినా లేదా సోషల్ మీడియా వేదికగా అధిక ధరలకు ఆఫర్ చేసినా వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# హైదరాబాద్ 'ఎంఎంటీఎస్'కు మహర్దశ



భాగ్యనగరవాసులకు అత్యంత కీలకమైన ఎంఎంటీఎస్ (మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్) సేవలను మరింత ప్రక్షాళన చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో నూతన రైల్వే ప్రాజెక్టుల పురోగతి, ఎంఎంటీఎస్ సేవల మెరుగుదల తదితర కీలక అంశాలపై న్యూఢిల్లీలోని రైల్వే భవన్ వేదికగా గురువారం అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి.. రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ప్రత్యేకంగా సమావేశమై రాష్ట్ర రైల్వే ముఖచిత్రంపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణ రైల్వే నెట్‌వర్క్ విస్తరణకు కేంద్రం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఈ భేటీ ద్వారా మరోసారి స్పష్టమైంది.

హైదరాబాద్ మహానగరంతో పాటు శివారు ప్రాంతాల ప్రజలకు, దినసరి ప్రయాణికులకు ఎంఎంటీఎస్ రైళ్లు అత్యంత చౌకైన, కీలకమైన రవాణా సాధనంగా ఉన్నాయని కిషన్ రెడ్డి ఈ సందర్భంగా రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అయితే, రైళ్ల రాకపోకల్లో కచ్చితమైన సమయపాలన (టైమింగ్స్ రెగ్యులరైజేషన్) లేకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిని వెంటనే సరిదిద్దాలని కోరారు. అలాగే స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. కిషన్ రెడ్డి విజ్ఞప్తిపై రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అత్యంత సానుకూలంగా స్పందించారు. ఎంఎంటీఎస్ నెట్‌వర్క్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు, మెరుగైన సేవలు అందించేందుకు త్వరలోనే సంబంధిత ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

కేవలం ఎంఎంటీఎస్ మాత్రమే కాకుండా, సమగ్ర తెలంగాణ రైల్వే అభివృద్ధిపైనా ఇరువురు కేంద్ర మంత్రులు ఈ భేటీలో లోతుగా సమీక్షించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 42 ప్రధాన రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి పనుల పురోగతిని ఈ సందర్భంగా సమీక్షించారు. ఎలక్ట్రిఫికేషన్ (విద్యుద్దీకరణ) పనుల వేగం, పెండింగ్‌లో ఉన్న కొత్త రైల్వే లైన్ల నిర్మాణం తదితర అంశాలపై సుదీర్ఘ మంతనాలు జరిపారు. వీటికి తోడుగా, రాష్ట్రంలో ప్రతిపాదించిన అత్యంత ప్రతిష్టాత్మకమైన హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులపై కూడా ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చకు రావడం గమనార్హం. తెలంగాణ రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాల కల్పన పట్ల కేంద్ర ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో, అంకితభావంతో పనిచేస్తోందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా రైల్వే కనెక్టివిటీని మరింత విస్తరించడంతో పాటు, ప్రజలకు అత్యుత్తమ ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన కిషన్ రెడ్డికి హామీ ఇచ్చారు. రాష్ట్ర పురోగతికి రైల్వే అభివృద్ధి అత్యంత కీలకమని, కేంద్రం అందిస్తున్న ఈ సహకారంతో తెలంగాణ రైల్వే రూపురేఖలు త్వరలోనే అద్భుతంగా మారబోతున్నాయని సమావేశం అనంతరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఒక పత్రికా ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు.

# కాళేశ్వరంలో సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభం

- తొలి పుణ్యస్నానం ఆచరించిన కంచి పీఠాధిపతి, మంత్రులు
- పోటెత్తిన భక్తులు.. 12రోజుల్లో 30లక్షల మంది వస్తారని అంచనా

**కాళేశ్వరం, మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో సరస్వతీ అంత్య పుష్కరాలు గురువారం ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. కంచి మఠం పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి తొలి పుణ్యస్నానం ఆచరించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు. ఉదయం 5:43 గంటలకు ఆయనతో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు దంపతులు పవిత్ర స్నానం చేశారు. తెలంగాణలో తొలిసారిగా జరుగుతున్న ఈ పుష్కరాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తున్నారు. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతీ నది కలిసే పవిత్ర త్రివేణి సంగమ క్షేత్రమే కాళేశ్వరం. దేశంలో ప్రయాగ్‌రాజ్ తర్వాత ఇలాంటి త్రివేణి సంగమం ఉన్న రెండో ప్రదేశం ఇదే. ఇక్కడ స్నానం ఆచరిస్తే పాపాలు తొలగిపోయి, పునర్జన్మ నుంచి విముక్తి లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ 12 రోజుల పుష్కరాలకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 20 నుంచి 30 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. పుష్కరాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రత, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు, రవాణా సౌకర్యాలు కల్పించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా భక్తులు ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ధార్మిక సలహాదారు శ్రీ గోవింద హరి తదితరులు పుష్కర ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో పుణ్యస్నానమాచరించారు. భూపాలపల్లి శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణ రావు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిలు కూడా పుష్కరస్నానం ఆచరించి వేద పండితులు ఆశీర్వాదాలు స్వీకరించారు.

# కమల దళం కదన కుతూహలం

- నేడు తెలంగాణ బీజేపీ కీలక భేటీ
- రాష్ట్ర కార్యాలయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశం
- భవిష్యత్ కార్యాచరణ, ప్రజా ప్రతినిధుల పాత్రపై దిశానిర్దేశం చేయనున్న అభయ్ పాటిల్
- వచ్చే నెలలో రాష్ట్రానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్
- 10 జిల్లాల నూతన కార్యాలయాల ప్రారంభం



**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై పూర్తిస్థాయిలో పట్టు సాధించడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అడుగులు వేగవంతం చేసింది. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత బలోపేతం, భవిష్యత్ రాజకీయ వ్యూహాలకు పదును పెట్టే దిశగా తెలంగాణ బీజేపీ సన్నద్ధమైంది. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం సరిగ్గా 9 గంటలకు నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అత్యంత కీలకమైన సమావేశం జరగనుంది. తెలంగాణ రాష్ట్ర బీజేపీ పొలిటికల్ ఇంచార్జ్ అభయ్ పాటిల్ నేతృత్వంలో జరగనున్న ఈ అత్యున్నత స్థాయి భేటీకి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాలు, అధికార పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే వ్యూహాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపడంతో పాటు, త్వరలో జరగనున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశాల నిర్వహణపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో ఎన్నికైన ప్రజా ప్రతినిధుల (ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు) పాత్ర ఎలా ఉండాలనే దానిపై పొలిటికల్ ఇంచార్జ్ అభయ్ పాటిల్ వారికి స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయడం, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడపగడపకూ చేర్చడం ద్వారా సంస్థాగతంగా పార్టీని మరింత పటిష్టం చేసేలా కార్యాచరణ పక్కాగా రూపొందించనున్నారు. మరోవైపు, తెలంగాణ రాష్ట్రంపై బీజేపీ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించింది. వరుసగా హైకమాండ్ పెద్దల పర్యటనలతో రాష్ట్ర బీజేపీ నేతలు బిజీబిజీగా గడుపుతున్నారు. ఈ నెల 10వ తేదీన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించి పార్టీ శ్రేణుల్లో భారీగా జోష్ నింపిన విషయం తెలిసిందే. ఆ ఉత్సాహం ఏమాత్రం తగ్గకముందే, వచ్చే నెల (జూన్) మొదటి వారంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణ రాష్ట్రంలో పర్యటించనున్నారు. జాతీయ అధ్యక్షుడి హోదాలో ఆయన రాక పార్టీ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను, ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో రాష్ట్ర నాయకత్వం నిమగ్నమైంది. వచ్చే నెల మొదటి వారంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలకు జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకత్వానికి ఆయన భవిష్యత్ పోరాటాలపై దిశానిర్దేశం చేయనున్నారు. అంతేకాకుండా, తెలంగాణవ్యాప్తంగా పార్టీ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో భాగంగా, నూతనంగా నిర్మించిన పది జిల్లాల బీజేపీ కార్యాలయాలను నితిన్ నబీన్ తన చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభించనున్నారు. వరుసగా జాతీయ స్థాయి అగ్రనేతలు రాష్ట్రానికి వస్తుండటం, సంస్థాగత నిర్మాణాలపై అధిష్టానం సీరియస్‌గా దృష్టి సారించడంతో తెలంగాణ రాజకీయాల్లో కమలనాథుల వ్యూహాలు ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారాయి.

# ఆధునిక భారత నిర్మాతకు ఘన నివాళి



హైదరాబాద్, మహా : దేశ సమగ్రత, సార్వభౌమాధికారం కోసం ప్రాణాలర్పించిన మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను శరవేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. గురువారం రాజీవ్ గాంధీ వర్ధంతి (ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం) సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం ఎదురుగా ఉన్న ఆ మహానేత విగ్రహానికి ముఖ్యమంత్రి ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా దేశానికి రాజీవ్ చేసిన విశేష సేవలను, ఆయన దార్శనికతను సీఎం స్మరించుకున్నారు. ఇరవై ఒకటో శతాబ్దంలో దేశాన్ని కంప్యూటర్, ఐటీ యుగం వైపు నడిపించి.. ప్రపంచ పటంలో నవ భారతానికి ఒక స్పష్టమైన దిశా నిర్దేశం చేసిన గొప్ప దార్శనిక నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఆధునిక సాంకేతిక యుగం వైపు దేశ యువతను సన్నద్ధం చేయడంలో ఆయన పాత్ర చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించబడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ లాంటి మహానాయకుల స్ఫూర్తిని పుణికిపుచ్చుకున్న రాజీవ్.. దేశ ఐక్యత కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయలేదని రేవంత్ రెడ్డి కీర్తించారు. దేశంలో టెలికాం, కంప్యూటర్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే కాకుండా, పరిపాలనలో మహిళలకు సముచిత భాగస్వామ్యం దక్కినప్పుడే దేశం నిజమైన పురోభివృద్ధి సాధిస్తుందని ఆయన నమ్మారని గుర్తుచేశారు. ఆ నమ్మకంతోనే స్థానిక సంస్థల్లో మహిళలకు చారిత్రాత్మక రిజర్వేషన్లు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. ఇదే స్ఫూర్తితో చట్టసభల్లోనూ (లోక్‌సభ, శాసనసభల్లో) మహిళలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో ఎలాంటి చిక్కుముడులు, జాప్యం లేకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లును మరోసారి ప్రవేశపెట్టి వెంటనే అమలు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఈ వేదికగా ఆయన స్పష్టమైన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంతో గాంధీ కుటుంబానికి విడదీయరాని గొప్ప భావోద్వేగ అనుబంధం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షను గౌరవిస్తూ, ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడంలో యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ అత్యంత సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని ఆయన గుర్తుచేశారు. ఆ కుటుంబం చేసిన త్యాగాలను తెలంగాణ సమాజం ఎన్నటికీ మర్చిపోదని స్పష్టం చేశారు.

## మావిగన్ అంటే..
# బాబుకు గుండె ఆగేలా ఉంది


సాధ్యం కాదని తెలిసినా అమరావతిపై ముందుకు వెళ్తున్నారు. స్కామ్‌ల కోసమే చంద్రబాబు ముందుకెళ్తున్నారు. ఇప్పటికే అమరావతికి రూ.47,387 కోట్లు అప్పు చేశారు. ఖజానా నుంచి రూ.9200 కోట్లు ఖర్చు చేయబోతున్నారు. స్కామ్‌ల కోసం రాష్ట్ర ప్రజల వెన్ను విరుస్తున్నారు. ప్రశ్నిస్తే చంద్రబాబుకు బీపీ పెరుగుతోంది. రాష్ట్రానికి రాజధాని ఉండాలనే మావిగన్‌ను ప్రతిపాదించాం. రాష్ట్ర పరిస్థితుల దృష్ట్యా మావిగన్‌ను ప్రత్యామ్నాయంగా చూపించాం. అమరావతి అయితే జీరో నుంచి మొదలుపెట్టాలి. చంద్రబాబు స్కామ్‌ల కోసం ఏపీని ఇబ్బంది పెడుతున్నారు. ప్రజలకు కూడా మావిగన్‌కు మద్దతు పలికారు. అది తట్టుకోలేక చంద్రబాబు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు. మంత్రులతో కూడా బూతులు మాట్లాడిస్తున్నారు. రూ.1200 కోట్లతో అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ ఉన్నా మళ్లీ అన్నీ కొత్తగా కడతానంటున్నారు. కొత్తగా నిర్మిస్తున్న 5 బిల్డింగ్‌ల నిర్మాణం పేరుతో చంద్రబాబు దోపిడీ చూస్తే ప్రజలు నివ్వెరపోతున్నారు. భవన డిజైన్లకే రూ.401 కోట్లు. ఈ ఐదు బిల్డింగులకు అయ్యే మొత్తం ఖర్చు రూ. 10,665 కోట్లు.. అంటే ప్రస్తుతం చదరపు అడుగుకు రూ.20,427?. వాటి ఫర్నీచర్, ఇంటీరియర్ ఇంకా అదనపు ఖర్చులన్నమాట.. అంటే చదరపు అడుగుకు రూ.30 వేలు దాటుతుందన్నమాట. మళ్లీ ఇవే నిర్మాణాలకు కొత్త టెండర్లు పిలిచారు.. కానీ, పాత వాళ్లకే ఇచ్చారు. ఫైవ్‌స్టార్ హోటల్స్‌కు కూడా చదరపు అడుగు రూ.4,500 లోపే!. తెలంగాణలో రూ.615 కోట్లతో కేసీఆర్ సచివాలయం కట్టారు. మన సెక్రటేరియట్‌కు మాత్రం ఇంత ఖర్చా? ఎందుకు?. కొత్త అసెంబ్లీ, కొత్త హైకోర్టు అంటూ మళ్లీ భారీగా ఖర్చు చేయబోతున్నారు. ఇదంతా విచ్చలవిడిగా చేస్తున్న దోపిడీనే' అని తెలిపారు. ప్రజల బాగోగులను చంద్రబాబు గాలికి వదిలేశారు. రాష్ట్రాన్ని జంగిల్ రాజ్‌గా మార్చేశారు. ఎవరైనా ప్రశ్నిస్తే కేసులతో అణగదొక్కుతున్నారు. రెండేళ్లలో ఏం మంచి చేశారో చంద్రబాబు చెప్పాలి. ఈ రెండేళ్లలో బాబు ప్రొగ్రెస్ ఒక్కటే.. ''చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ''. రాష్ట్రంలో విచ్చలవిడిగా అవినీతి, దోపిడీ జరుగుతోంది. చంద్రబాబు మాత్రం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. తప్పులను ప్రశ్నిస్తే ఆయనకు బీపీ పెరుగుతోంది' అని వ్యాఖ్యానించారు.

**హత్యా రాజకీయాలు చేసింది టీడీపీ కాదా?**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో శవ రాజకీయాలు, హత్యా రాజకీయాలు చేస్తోంది చంద్రబాబేనని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో ఎవరిది గొడ్డలి పార్టీ, ఎవరిది గన్ కల్చర్, ఎవరివి కుట్ర రాజకీయాలు అనే అంశాలపై చంద్రబాబు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వైసీపీపై బురద చల్లేందుకు చంద్రబాబు, కొన్ని అనుకూల మీడియా సంస్థలతో కలిసి మాఫియా ముఠాగా మారి అబద్ధాలు, దొంగ సాక్ష్యాలు సృష్టిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. హత్యా రాజకీయాలకు తమదే అతి పెద్ద బాధిత కుటుంబం జగన్ పేర్కొన్నారు. తమ కుటుంబంలో ముగ్గురు కీలక వ్యక్తులు బలయ్యారంటూ ఆయన పలు సంచలన విషయాలను ప్రస్తావించారు. 1999 ఎన్నికలకు ఏడాది ముందు చంద్రబాబు సీఎం గా ఉన్నప్పుడే తన తాత రాజారెడ్డి హత్యకు గురయ్యారని, తన తాతాను చంపింది టీడీపీ కాదా? అని ప్రశ్నించారు. వైఎస్సార్‌ను పులివెందులకు పరిమితం చేయాలనే రాజకీయ కోణంలోనే ఈ హత్య జరిగిందన్నారు. ఈ కేసులో నిందితులను హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో దాచిపెట్టి అధికార దుర్వినియోగంతో రక్షించారని ఆరోపించారు. అసెంబ్లీలో 'నువ్వు సభకు ఎలా వస్తావో చూస్తాం' అని వైఎస్ రాజశేఖరరెడ్డిని ఉద్దేశించి చంద్రబాబు అన్న క్లిప్పింగులు ఇప్పటికీ ఉన్నాయని, ఆ మాట అన్న నాలుగు రోజులకే వైఎస్సార్ ప్రమాదంలో చనిపోయారని జగన్ గుర్తుచేశారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తానే చంపానని టీవీ లైవ్ షోలలో ఒప్పుకున్న దస్తగిరి అనే వ్యక్తి ఇవాళ పోలీసుల అండతో స్వేచ్ఛగా తిరుగుతున్నాడని.. చంద్రబాబుకు, దస్తగిరికి ఒకే లాయర్ (లూథ్రా) వాదిస్తున్నారని, దీని వెనుక ఎవరి క్రిమినల్ బ్రెయిన్ ఉందో ప్రజలు ఆలోచించాలన్నారు. చంద్రబాబు వియ్యంకుడు బాలకృష్ణ గన్ పట్టుకుని ఇద్దరిని కాల్చిపడేశారని జగన్ అన్నారు. నందమూరి హరికృష్ణ ప్రమాదంలో చనిపోతే పరామర్శకు వెళ్లి కేటీఆర్‌తో పొత్తుల గురించి మాట్లాడిన చంద్రబాబువి శవ రాజకీయాలు కావా అని ప్రశ్నించారు. సొంత మామ, రాజకీయ భిక్ష పెట్టిన ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి, సీఎం కుర్చీ, పార్టీ, గుర్తు లాక్కుని ఆయన చనిపోవడానికి కారణమైంది చంద్రబాబేనని విమర్శించారు. విజయవాడలో నిరాహార దీక్ష చేస్తున్న వంగవీటి మోహనరంగాను నరికి చంపిన కేసులో నిందితుడు వెలగపూడి రామకృష్ణబాబు ప్రస్తుతం టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నారని జగన్ చెప్పారు. అలాగే ఎన్టీఆర్ పై దాడి కేసులో అరెస్టయి, లాడ్జిలో శవమై తేలిన మల్లెల బాబ్జీ మరణం వెనుక కూడా చంద్రబాబు హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. "నేను మంచివాడ్ని కాబట్టే మా తాతను చంపిన వాళ్లు కూడా ఇవాళ ప్రశాంతంగా తిరుగుతున్నారు.. నేను చెడ్డవాడినైతే వాళ్లు అలా ఉండేవారా?" అని జగన్ ప్రశ్నించారు. విలువలు, విశ్వసనీయత, మాటకు కట్టుబడి రాజకీయం చేయడం తమ నైజమని.. 77 ఏళ్ల వయసులో కూడా చంద్రబాబు ఇలాంటి చిల్లర, కుట్ర రాజకీయాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. చంద్రబాబుకు బహుశా ఇదే చివరి రాజకీయ టర్మ్ కావచ్చని అన్నారు.

# అవ్వాతాతల మోముల్లో ఆనందం

- జూన్ 2న కొత్త పింఛన్ల పంపిణీ!
- రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కానుకగా 'చేయూత'.
- మూడేళ్ల నిరీక్షణకు తెర.
- దివ్యాంగులకు తొలి ప్రాధాన్యం.



**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రంలోని అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత సంతోషకరమైన వార్తను అందించింది. చాలా కాలంగా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదల ఆశలు నెరవేర్చే దిశగా అడుగులు వేసింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2వ తేదీన 'చేయూత' పథకం కింద కొత్త పింఛన్ల పంపిణీకి సర్కారు సన్నాహాలు ముమ్మరం చేసింది. దశాబ్దాలుగా పేదలకు అండగా ఉంటున్న పింఛన్ల పంపిణీలో ఉన్న దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు అర్హులైన లబ్ధిదారుల జాబితాలను జిల్లాల వారీగా వెంటనే సిద్ధం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు అన్ని జిల్లాల కలెక్టర్లకు అత్యవసర ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో లక్షలాది మంది పేదల ఇళ్లలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి.

**మూడేళ్ల నిరీక్షణకు దక్కిన ఫలితం**

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం సుమారు నలభై రెండు లక్షల మంది లబ్ధిదారులు ప్రతి నెలా పింఛను అందుకుంటున్నారు. అయితే, గత మూడు సంవత్సరాలుగా కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ పూర్తిగా నిలిచిపోవడంతో అర్హులైన ఎంతో మంది నిరాశకు గురయ్యారు. కేవలం మరణించిన పింఛనుదారుల స్థానంలో వారి జీవిత భాగస్వాములకు (భార్యలకు) మాత్రమే ప్రస్తుతం బదిలీ చేస్తున్నారు. వయోభారం, వైకల్యం, ఒంటరితనంతో బాధపడుతూ కొత్తగా దరఖాస్తు చేసుకున్న సుమారు పది లక్షల మందికి పైగా నిరుపేదలు ఎప్పటికైనా ప్రభుత్వం కరుణించకపోతుందా అని కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ఈ కఠినమైన పరిస్థితిని మానవతా దృక్పథంతో అర్థం చేసుకున్న ప్రస్తుత ప్రభుత్వం, వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది.

**బడ్జెట్‌లో రెండు లక్షల కొత్త పింఛన్లకు ఆమోదం**

గత మార్చి నెలలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తూ, రెండు లక్షల కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం లాంఛనంగా ఆమోదముద్ర వేసింది. దానికి అనుగుణంగా జూన్ 2న అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ కొత్త పింఛన్లను అధికారికంగా లబ్ధిదారుల చేతుల్లో పెట్టాలని సర్కారు నిర్ణయించింది. ఈ బృహత్తర కార్యక్రమానికి సంబంధించి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులకు ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఏ ఒక్క అనర్హుడికి చోటు దక్కకుండా, వాస్తవంగా అవసరమైన ప్రతి పేదవాడిని గుర్తించి, పకడ్బందీగా జిల్లాల వారీగా అర్హులైన వారి జాబితాలను పంపాలని కలెక్టర్లకు ప్రభుత్వం కచ్చితమైన ఆదేశాలు ఇచ్చింది.

**పారదర్శకత కోసం సాంకేతిక పరిజ్ఞానం**

సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నూరు శాతం పారదర్శకతను పాటించేందుకు ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రస్తుత పింఛనుదారుల వివరాలను ఫేషియల్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) యాప్‌లో నమోదు చేసే ప్రక్రియను ముమ్మరంగా చేపట్టింది. ఈ అధునాతన విధానం ద్వారా మరణించిన వారి వివరాలు, వేరే ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారి సమాచారం, అలాగే ప్రస్తుతం జీవించి ఉన్న వారి 'లైవ్‌నెస్ అథెంటికేషన్'ను పకడ్బందీగా పరిశీలిస్తున్నారు. ఈ కఠినమైన వడపోత వల్ల అనర్హులను ఏరివేసి, ఆ స్థానంలో నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేసేందుకు మార్గం సుగమమైంది.

**గ్రామ సభల ద్వారా తుది జాబితాలు.. దివ్యాంగులకే తొలి ప్రాధాన్యం**

సాంకేతిక ప్రక్రియ పూర్తయిన వెంటనే గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో ప్రత్యేకంగా గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ బహిరంగ సభల్లో మరణించిన వారి వివరాలను స్థానిక ప్రజల ముందు ఉంచి, వారిని అధికారిక జాబితా నుంచి తొలగిస్తూ ఏకగ్రీవ తీర్మానాలు చేస్తారు. ఈ ప్రజాస్వామ్య విధానం ద్వారా క్షేత్రస్థాయిలో పూర్తి పారదర్శకత నెలకొంటుందని, నెలాఖరుకల్లా ఈ తుది జాబితాల వడపోత పూర్తవుతుందని అధికార యంత్రాంగం భావిస్తోంది. ఇక కొత్త పింఛన్ల మంజూరులో ప్రాధాన్యతా క్రమాన్ని సైతం ప్రభుత్వం ఖరారు చేసింది. సమాజంలో అత్యంత నిస్సహాయ స్థితిలో ఉండే దివ్యాంగులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని నిశ్చయించింది. ఆ తర్వాత అత్యవసర సాయం అవసరమైన వయోవృద్ధులు, వితంతువుల దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఏళ్ల తరబడి నెలకొన్న సందిగ్ధతకు తెరదించుతూ, అర్హులైన పేదలందరికీ అండగా నిలిచేలా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



## బంగారు కిరీటం మాయం కేసు..
## రూ.30 లక్షలకు
# తాకట్టు!

**గుడివాడ:** గుడివాడ వెంకటేశ్వరస్వామి ఆలయంలో బంగారు కిరీటం మాయం కేసుకు సంబంధించి పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు పోకూరి మోహన్‌రావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు మోహన్‌రావుపై కేసు నమోదు చేసిన పోలీసులు,.. ఆ బంగారు కిరీటాన్ని రూ. 30 లక్షలకు తాకట్టు పెట్టినట్లు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. దాత సుబ్బారావు ఫిర్యాదుతో చివరకు చర్యలకు సన్నద్ధమయ్యారు పోలీసులు. కాగా, గత ఏడాది మాటూరు సుబ్బారావు అనే భక్తుడు గుడివాడ వెంకటేశ్వర స్వామివారికి కిరీటం కానుకగా సమర్పించారు. ఏడాది తర్వాత దాత సుబ్బారావు తిరిగి దర్శనానికి వచ్చారు. అయితే, దర్శన సమయంలో కిరీటం కనిపించకపోవడంతో ఆయన పాలకవర్గాన్ని నిలదీశారు. మొదట పాలకవర్గం కిరీటం బ్యాంక్ లాకర్‌లో ఉందని చెప్పింది. కానీ గట్టిగా ప్రశ్నించడంతో అసలు విషయం బయటపడింది. కిరీటాన్ని తాకట్టు పెట్టినట్లు వారు అంగీకరించారు. దాంతో సుబ్బారావు కిరీటం ఉందా? లేక అమ్మేశారా? అంటూ సందేహం వ్యక్తం చేస్తూ పోలీసులను ఆశ్రయించారు. అయితే, ఫిర్యాదు చేసేందుకు ముందుకు వచ్చిన ఆయనకు పోలీసులు షాక్ ఇచ్చారు. కిరీటంపై కోర్టుకే వెళ్లమని సూచించిన పోలీసులు.. ఎట్టకేలకు కేసు నమోదు చేశారు.

# కాళేశ్వరంలో ఆధ్యాత్మిక శోభ

- ముక్తీశ్వరుని సన్నిధికి గవర్నర్ శివప్రతాప్ శుక్లా.
- ఘన స్వాగతం పలికిన మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు.
- త్రివేణి సంగమంలో పుణ్యస్నానా-లు.
- సప్తహారతి, కన్నులపండువగా సాంస్కృతిక కార్యక్రమాలు.

**కాళేశ్వరం, మహా :** తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, కనీవినీ ఎరుగని రీతిలో జరుగుతున్న పవిత్ర 'సరస్వతీ అంత్య పుష్కరాల' మహా క్రతువులో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా గురువారం కాళేశ్వరం చేరుకున్నారు. దేశంలోనే అత్యంత విశిష్టమైన త్రివేణి సంగమ (గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీ నదుల కలయిక) తీరానికి విచ్చేసిన రాష్ట్ర ప్రథమ పౌరుడికి.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఘనంగా స్వాగతం పలికారు. పవిత్ర పుణ్యక్షేత్రంలో అడుగుపెట్టిన గవర్నర్‌కు అధికారులు, అర్చకులు వేద మంత్రోచ్చారణలు, పూర్ణకుంభంతో సంప్రదాయబద్ధంగా సాదర స్వాగతం పలికారు. కాళేశ్వరం చేరుకున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా.. ముందుగా పవిత్ర త్రివేణి సంగమ ఘాట్ వద్ద భక్తి శ్రద్ధలతో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. తదనంతరం అక్కడి నుంచి నేరుగా శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి ప్రాచీన ఆలయానికి చేరుకుంటారు. గర్భగుడిలో కొలువై ఉన్న స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందనున్నారు. పుష్కరాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పవిత్ర యజ్ఞ యాగాదులను ఆయన స్వయంగా వీక్షించనున్నారు. దేశంలో ప్రయాగ్‌రాజ్ తర్వాత అంతటి విశిష్టత కలిగిన ఈ క్షేత్రంలో గవర్నర్ పర్యటనతో ఆధ్యాత్మిక వాతావరణం మరింత వెల్లివిరిసింది. స్వామివారి దర్శనానంతరం సాయంత్రం వేళ సరస్వతీ ఘాట్ వద్ద దేవాదాయ శాఖ, జిల్లా యంత్రాంగం అత్యంత వైభవంగా ఏర్పాటు చేసిన 'సప్తహారతి' కార్యక్రమంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.. నదీమతల్లికి సమర్పించే ఈ మహా హారతి కన్నులపండువగా జరిగింది. అనంతరం భక్తులను అలరించేందుకు, పుష్కరాల విశిష్టతను చాటేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన వీక్షించారు. శుక్రవారం ఉదయం సరిగ్గా 9 గంటలకు ఆయన కాళేశ్వరం నుంచి బయలుదేరి తిరిగి హైదరాబాద్‌లోని రాజ్ భవన్‌కు చేరుకుంటారు. రాష్ట్ర ప్రథమ పౌరుడి రాకతో కాళేశ్వరం పుణ్యక్షేత్రం వద్ద పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది.

# ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం!

- బూత్ స్థాయి నుంచే పార్టీ నిర్మాణం.
- గడపగడపకూ కేంద్ర ప్రభుత్వ పథకాలు.
- కోయంబత్తూరు వేదికగా బీజేపీ కీలక సమీక్ష.
- నేతలకు బీఎల్ సంతోష్, పొంగులేటి సుధాకర్ రెడ్డి దిశానిర్దేశం.



**కోయంబత్తూరు, మే 21 :** "తమిళనాడులో ప్రజల పక్షాన నిలబడి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసినప్పుడే ప్రజల గుండెల్లో పార్టీకి సుస్థిర స్థానం దక్కుతుందని
జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) ఆదరణీయ బీఎల్ సంతోష్, బీజేపీ జాతీయ నాయకులు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల కో ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సామాన్యుడి గడపకు చేర్చుతూ, ప్రతి పోలింగ్ బూత్ కేంద్రంగా పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి అంటూ భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకత్వం శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేసింది.

గురువారం కోయంబత్తూరులోని బీజేపీ జిల్లా కార్యాలయం వేదికగా జరిగిన అత్యున్నత స్థాయి కీలక సమీక్షా సమావేశంలో వారు భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో బీఎల్ సంతోష్ మాట్లాడుతూ.. నాయకులు కేవలం కార్యాలయాలకు పరిమితం కాకుండా నేరుగా ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపుతూ, సామాన్యులకు అండగా నిలవడమే పార్టీ తక్షణ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో మమేకం అయినప్పుడే తమిళనాట భారతీయ జనతా పార్టీ పట్ల ప్రజల్లో అమితమైన విశ్వాసం కలుగుతుందని, ఆ దిశగా ప్రతి ఒక్క నాయకుడు చిత్తశుద్ధితో అంకితభావంతో పనిచేయాలని ఆయన ఉద్బోధించారు.

పార్టీ సంస్థాగత నిర్మాణంపై డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి లోతుగా విశ్లేషించారు. గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీని పటిష్టం చేసేందుకు తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై ఆయన కీలక సూచనలు చేశారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో పార్టీ కమిటీలను మరింత చురుకుగా మార్చాలని, కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న అద్భుతమైన ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు. సంస్థాగతంగా పునాదులు బలంగా ఉన్నప్పుడే రాజకీయంగా మంచి ఫలితాలు సాధించగలమని, బూత్ స్థాయి కార్యకర్తలే పార్టీకి అసలైన బలం అని పొంగులేటి స్పష్టం చేశారు.

ఒక నది ప్రవాహంలా సాగిన ఈ సమీక్షా సమావేశంలో తమిళనాడు రాష్ట్ర బీజేపీ వ్యవహారాల ఇంచార్జి అరవింద్ మీనన్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్, ఉదకమండలం (ఊటీ) నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే భోజరాజన్ సహా పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేసి, యువత, మహిళలను పెద్ద ఎత్తున పార్టీలోకి ఆకర్షించేలా సరికొత్త ప్రణాళికలతో ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని నేతలు ఈ సమావేశం ద్వారా ఏకగ్రీవంగా నిర్ణయించారు.



# యూపీలో మళ్లీ బీజేపీనే...
## యాక్సిస్ మై ఇండియా అధినేత ప్రదీప్ గుప్తా

**మహా :** ఉత్తర్‌ప్రదేశ్‌లో అధికార బీజేపీ పాలన పట్ల ప్రజలు సంతృప్తితో ఉన్నారని ప్రముఖ ఎన్నికల విశ్లేషకుడు, యాక్సిస్ మై ఇండియా అధినేత ప్రదీప్ గుప్తా అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే యూపీలో బీజేపీకి 2027లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దగా ఇబ్బందులు కనిపించడం లేదన్నారు. అదే సమయంలో, ఉత్తర్‌ప్రదేశ్ రాజకీయంగా అస్థిరంగా ఉందని, ఓటర్ల మనోభావాలలో వేగవంతమైన మార్పులు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు

# ఖజానాకు మద్యం కాసుల వర్షం

- రికార్డు స్థాయిలో రూ. 44 వేల కోట్ల ఆదాయం.
- మందుబాబుల కిక్కు.. ప్రభుత్వానికి పసిడి పండుగ.
- గతేడాదితో పోలిస్తే అదనంగా రూ. 7 వేల కోట్ల రాబడి.
- మద్యం పాలసీ హిట్, బెల్ట్ షాపుల కట్టడితోనే అద్భుత ఫలితాలు.
- ఒక్క డిసెంబర్‌లోనే రూ. 5 వేల కోట్ల విక్రయాలు.



హైదరాబాద్, మహా : రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ప్రభుత్వ ఖజానాకు కాసుల వర్షం కురిపించింది. మునుపెన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో రాబడిని ఆర్జించి రాష్ట్ర చరిత్రలోనే సరికొత్త మైలురాయిని చేరుకుంది. ఎక్సైజ్ శాఖ ద్వారా ప్రభుత్వానికి ఏకంగా రూ.44,557 కోట్ల భారీ ఆదాయం సమకూరినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. గతేడాదితో పోల్చి చూస్తే ఈసారి దాదాపు రూ.7 వేల కోట్ల అదనపు ఆదాయం రావడం గమనార్హం. మద్యం విక్రయాలు అమాంతం పెరిగిపోవడం వల్లే ఈ స్థాయిలో ఆదాయం రాలేదని, నూతన మద్యం పాలసీని పకడ్బందీగా అమలు చేయడం, బెల్ట్ షాపులను కఠినంగా నియంత్రించడం, అక్రమ మద్యం సరఫరాకు పూర్తిగా చెక్ పెట్టడం వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని అధికారులు విశ్లేషిస్తున్నారు. దీనికితోడు ఎన్నికల హడావుడి, పండుగల సీజన్, నూతన సంవత్సర వేడుకలు సైతం ప్రభుత్వ ఆదాయాన్ని భారీగా పెంచాయి.

మొత్తం ఆదాయంలో అత్యధిక భాగం నేరుగా మద్యం విక్రయాల ద్వారానే సమకూరింది. రాష్ట్రవ్యాప్తంగా లిక్కర్, బీర్ల అమ్మకాల ద్వారా రూ.40,209 కోట్ల ఆదాయం ఖజానాకు చేరింది. అయితే, వినియోగం విషయంలో ఆసక్తికరమైన గణాంకాలు నమోదయ్యాయి. గతేడాదితో పోలిస్తే లిక్కర్ వినియోగం స్వల్పంగా రెండు శాతం మేర పెరగ్గా, వేసవిలో డిమాండ్ ఉన్నప్పటికీ బీర్ల అమ్మకాలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. 202324 ఆర్థిక సంవత్సరంలో 5.48 కోట్ల కేసుల బీర్లు అమ్ముడుపోగా, తదుపరి ఆర్థిక సంవత్సరంలో ఆ సంఖ్య 5.31 కోట్ల కేసులకు పడిపోయిందని ఎక్సైజ్ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తాజా ఆర్థిక సంవత్సరంలో మొత్తం 3,08,291 వేల కేసుల లిక్కర్, 3,08,734 వేల కేసుల బీర్లు అమ్ముడుపోయినట్లు అధికారులు వివరించారు.

మద్యం విక్రయాలకు తోడు లైసెన్సింగ్ ప్రక్రియ ద్వారా కూడా ప్రభుత్వానికి భారీ స్థాయిలో కనకవర్షం కురిసింది. నూతన మద్యం దుకాణాల లైసెన్సుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 95,628 దరఖాస్తులు రాగా, కేవలం ఈ దరఖాస్తుల రుసుము రూపంలోనే రూ.2,869 కోట్ల రాబడి వచ్చింది. అలాగే రాష్ట్రంలో పనిచేస్తున్న 2,620 ఎ4 రిటైల్ మద్యం దుకాణాల వార్షిక అద్దె ఫీజుల ద్వారా మరో రూ.1,771 కోట్లు, అనుమతి పొందిన 1,214 బార్ అండ్ రెస్టారెంట్ల వార్షిక లైసెన్స్ ఫీజుల రూపంలో రూ.549 కోట్లు ఖజానాకు చేరాయి. పెద్ద మొత్తంలో లైసెన్స్ ఫీజులు రావడం ఆదాయం అమాంతం పెరగడానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా నిలిచింది. జిల్లాల వారీగా విక్రయాలను పరిశీలిస్తే.. పట్టణీకరణ అధికంగా ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ తదితర ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో మద్యం అమ్ముడుపోయింది.

డిసెంబర్ నెల రాష్ట్ర ఎక్సైజ్ చరిత్రలోనే అత్యధిక విక్రయాలు జరిగిన మాసాల్లో ఒకటిగా చరిత్రకెక్కింది. పంచాయతీ ఎన్నికలు, క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు అన్నీ ఒకేసారి రావడంతో కేవలం డిసెంబర్ నెలలోనే రూ.5,051 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. బడ్జెట్ అంచనాల ప్రకారం ఎక్సైజ్ డ్యూటీల కింద ప్రభుత్వం భారీ వసూళ్లు ఆశించగా, రూ.23,359 కోట్లు ప్రత్యక్ష ఎక్సైజ్ సుంకంగా ఖజానాకు చేరాయి. ఏది ఏమైనప్పటికీ పన్ను లీకేజీలను అరికట్టడం, డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, మార్కెట్లోకి కొత్త బ్రాండ్లకు అనుమతులు ఇవ్వడం, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపడం లాంటి పటిష్టమైన చర్యల వల్లే ఈ చారిత్రక రికార్డు సాధ్యమైందని ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు సగర్వంగా తెలియజేస్తున్నారు.

# మెగాస్టార్‌తో మెగా పవర్

- 'సీన్ రివర్స్' అంటూ చిరంజీవి ఎమోషనల్ పోస్ట్
- దర్శకుడు బాబీతో చిరంజీవి కొత్త చిత్రం గ్రాండ్‌గా ప్రారంభం.. క్లాప్ కొట్టిన పవన్ కల్యాణ్
- 30 ఏళ్ల నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్న మెగాస్టార్.. వైరల్‌గా మారిన ఆప్త వాక్యాలు

హైదరాబాద్, మహా : టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ కె.ఎస్. రవీంద్ర (బాబీ) కాంబినేషన్‌లో వస్తున్న కొత్త సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో అత్యంత ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేయడం ఈ కార్యక్రమానికి అదనపు ఆకర్షణగా నిలిచింది. పవన్ కల్యాణ్ తన సోదరుడు చిరంజీవి నటిస్తున్న ఈ కొత్త చిత్రానికి ముహూర్తపు క్లాప్ కొట్టడం చూసి మెగా అభిమానులు ఆనందంతో మురిసిపోయారు.ఈ అపురూప ఘట్టంపై చిరంజీవి తన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ అత్యంత భావోద్వేగపూరితమైన పోస్ట్ చేశారు. సుమారు 30 ఏళ్ల క్రితం పవన్ కల్యాణ్ హీరోగా పరిచయమైన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రానికి తాను క్లాప్ కొట్టిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. "కాలం ఎలా గడిచిపోయిందో.. అప్పట్లో పవన్ తొలి సినిమాకు నేను క్లాప్ కొట్టాను, ఇప్పుడు నా కొత్త సినిమాకు తమ్ముడు పవన్ క్లాప్ కొట్టాడు. సీన్ రివర్స్ అయినట్టు అనిపిస్తోంది" అని చిరంజీవి పేర్కొనడం అభిమానులను కట్టిపడేస్తోంది. పవన్ చేతుల మీదుగా ఈ చిత్రం ప్రారంభం కావడం తనకెంతో ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తుందని ఆయన తన పోస్ట్‌లో ఆనందం వ్యక్తం చేశారు. ఈ పోస్ట్ ప్రస్తుతం ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. దశాబ్దాలుగా తెలుగు సినీ పరిశ్రమలో తిరుగులేని మెగాస్టార్‌గా చిరంజీవి, పవర్ స్టార్‌గా పవన్ కల్యాణ్ ప్రస్థానం ఎలా సాగిందో, వారి మధ్య ఉన్న అనుబంధం ఎంతటిదో ఈ ఒక్క క్లాప్ ఘట్టం మరోసారి నిరూపించింది. ఈ వార్తను, చిరంజీవి భావోద్వేగ పోస్ట్‌ను మెగా అభిమానులు సోషల్ మీడియాలో భారీగా షేర్ చేస్తూ 'మెగా పవర్' అంటూ హ్యాష్‌ట్యాగ్‌లను ట్రెండ్ చేస్తున్నారు. దర్శకధీరుడు బాబీ ప్లాన్ చేసిన ఈ క్రేజీ ప్రాజెక్ట్ పట్ల ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.




# సినీ రంగానికి 'కూటమి' నూతన ఉత్తేజం

- ఏపీఎస్ఎఫ్‌టీవీటీడీసీ చైర్మన్‌గా భరత్ భూషణ్
- వైస్ చైర్మన్‌గా ప్రముఖ దర్శకుడు మెహర్ రమేష్
- మరో 14 మందితో నూతన పాలకమండలి ఏర్పాటు
- పూర్వవైభవమే లక్ష్యంగా కీలక నిర్ణయం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం









**అమరావతి , మహా :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చలన చిత్ర, టెలివిజన్, నాటకరంగాలకు పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అత్యంత కీలక అడుగు వేసింది. పరిశ్రమను సమూలంగా అభివృద్ధి చేసి, నూతన ఉత్తేజం నింపడమే లక్ష్యంగా 'ఏపీ స్టేట్ ఫిల్మ్, టెలివిజన్, అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' (ఏపీఎస్ఎఫ్‌టీవీటీడీసీ) నూతన పాలక మండలిని అట్టహాసంగా ప్రకటించింది. ఈ ప్రతిష్టాత్మక కార్పొరేషన్ చైర్మన్‌గా టాలీవుడ్ సీనియర్ నిర్మాత, ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ పి. భరత్ భూషణ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, కార్పొరేషన్ వైస్ చైర్మన్ బాధ్యతలను ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు చిక్కాల మెహర్ రమేష్‌కు అప్పగించింది. సినీ పరిశ్రమలోని వివిధ రంగాలకు చెందిన అపార అనుభవజ్ఞులకు ఈ పాలకమండలిలో చోటు కల్పించడం ద్వారా, అన్ని విభాగాల సమస్యలను వేగంగా పరిష్కరించాలన్న ప్రభుత్వ చిత్తశుద్ధి స్పష్టమవుతోంది.

చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు చలనచిత్ర పరిశ్రమకు చెందిన మరో 14 మంది హేమాహేమీలను ఏపీఎస్ఎఫ్‌టీవీటీడీసీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా (సభ్యులుగా) నియమిస్తూ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నూతన కమిటీలో సుప్రసిద్ధ సినీ రచయిత బుర్ర సాయి మాధవ్, సీనియర్ నటులు సుమన్ తల్వార్, శివాజీ, ప్రముఖ నటి ఝాన్సీ, సీనియర్ నిర్మాతలు చదలవాడ శ్రీనివాస రావు, కూచిభోట్ల వివేకానంద తదితరులకు డైరెక్టర్లుగా సముచిత స్థానం కల్పించారు. నటీనటులు, నిర్మాతలు, రచయితలు ఇలా ఇండస్ట్రీలోని అన్ని క్రాఫ్ట్‌ల ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి పాలకమండలిని అత్యంత పటిష్టంగా తీర్చిదిద్దారు. నాటకరంగం, టెలివిజన్ రంగాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న ప్రముఖులకు కూడా ఇందులో భాగస్వామ్యం కల్పించి సమతౌల్యం పాటించారు. ఈ నియామకాలతో ఏపీ ప్రభుత్వానికి, సినీ పరిశ్రమకు మధ్య బలమైన వారధిగా ఈ కార్పొరేషన్ క్రియాశీలక పాత్ర పోషించనుంది.

కార్పొరేషన్ రథసారథిగా ఎంపికైన పి. భరత్ భూషణ్‌కు చిత్ర పరిశ్రమలో రెండు దశాబ్దాలకు పైగా విశేషమైన అనుభవం ఉంది. డిస్ట్రిబ్యూటర్‌గా ఎన్నో అద్భుతమైన విజయాలను ప్రేక్షకులకు అందించిన ఆయన, గతంలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా వ్యవహరించి సినీ కార్మికులకు, నిర్మాతలకు తలలో నాలుకలా నిలిచిన ట్రాక్ రికార్డ్ ఉంది. భరత్ భూషణ్, మెహర్ రమేష్ ద్వయం నేతృత్వంలోని ఈ నూతన బోర్డు ఏపీలో చలనచిత్ర పరిశ్రమ ముఖచిత్రాన్ని మార్చనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా విశాఖపట్నాన్ని ప్రపంచస్థాయి సినిమా హబ్‌గా తీర్చిదిద్దడం, సింగిల్ విండో సిస్టమ్ ద్వారా సినిమా షూటింగ్‌లకు అత్యంత సులభంగా, వేగంగా అనుమతులు మంజూరు చేయడం, థియేటర్ల మనుగడ కోసం ఆ వ్యవస్థను బలోపేతం చేయడం ఈ కమిటీ ప్రధాన అజెండాగా ఉండనుంది.దీనితో పాటుగా, రాష్ట్రంలో క్రమంగా ఉనికి కోల్పోయి మూలనపడుతున్న ప్రాచీన నాటకరంగానికి జీవం పోయడం, కళాకారులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించడం, స్థానికంగా టెలివిజన్ రంగాన్ని ప్రోత్సహించడంపై ఈ బోర్డు ప్రత్యేక దృష్టి సారించనుంది. రానున్న రోజుల్లో సినీ వర్గాల కల అయిన ప్రతిష్టాత్మక నంది అవార్డుల ప్రదానోత్సవాన్ని తిరిగి పునఃప్రారంభించడంతో పాటుగా, ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న నాటకోత్సవాల వైభవాన్ని మళ్లీ ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడంలో ఈ కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం బలంగా నమ్ముతోంది. అటు చలనచిత్ర రంగానికి, ఇటు టీవీ, నాటక రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ నూతన పాలకమండలిని ఏర్పాటు చేయడం పట్ల కళాకారులు, టాలీవుడ్ పరిశ్రమ వర్గాల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. దశాబ్దాలుగా ఏపీకి దూరమైన సినీ కళకళలు ఈ నిర్ణయంతో తిరిగి రాష్ట్రానికి రానున్నాయని సినీ పండితులు అభిప్రాయపడుతున్నారు.

# తొలి సినిమాయే ఫ్లాప్.. జ్యోతికను తక్కువ అంచనా వేసిన బాలీవుడ్

జ్యోతిక సౌత్‌లో స్టార్ హీరోయిన్ అవడానికి ముందు బాలీవుడ్‌లో ట్రై చేసింది. డోలి సజాకే రఖ్నా (1998) చిత్రంతో వెండితెరపై కథానాయికగా పరిచయమైంది. అక్షయ్ ఖన్నా హీరోగా నటించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మెప్పించలేకపోయింది. తొలి సినిమాయే కలిసిరాకపోవడంతో బాలీవుడ్ తనకు మరో అవకాశమివ్వకుండా తలుపులు మూసేసింది. దాంతో తమిళంలో ట్రై చేసింది. తమిళ, కన్నడ, తెలుగు భాషల్లో వరుస సినిమాలు చేస్తూ తక్కువకాలంలోనే స్టార్ హీరోయిన్‌గా రాణించింది.



### ప్రేమ- పెళ్లి

అయితే కెరీర్ ప్రారంభంలోనే ప్రేమలో పడింది జ్యోతిక. 'పూవెల్లం కెట్టుప్పార్' సినిమాలో సూర్యతో కలిసి నటించగా.. ఆ పరిచయం ప్రేమకు దారి తీసింది. ఆ తర్వాత వీరు జంటగా నాలుగు సినిమాల్లో యాక్ట్ చేయగా ఆ ప్రేమబంధం మరింత బలపడింది. 2006 సెప్టెంబర్ 11న తమ ప్రేమను వైవాహిక బంధంతో పదిలపర్చుకున్నారు. ఈ జంటకు కూతురు దియా, కుమారుడు దేవ్ సంతానం.

### ఆదరించని బాలీవుడ్

పెళ్లయ్యాక కొంత గ్యాప్ తీసుకున్న ఈ హీరోయిన్ తర్వాత సినిమాల్లో రీఎంట్రీ ఇచ్చింది. కానీ, ఈసారి బాలీవుడ్ నుంచే ఎక్కువ అవకాశాలు వస్తున్నాయి. అప్పుడు పొమ్మన్న బాలీవుడే ఈసారి రారమ్మని ఎర్ర తివాచీ పరుస్తోంది. దీని గురించి జ్యోతిక మాట్లాడుతూ.. నా ఫస్ట్ హిందీ చిత్రం ఆడనందుకు బాలీవుడ్ నా ముఖంపైనే తలుపేసింది. తమిళంలో కూడా నా మొదటి సినిమా ఆడలేదు. కానీ ఇక్కడ నా పనితనాన్ని మెచ్చి వరుస అవకాశాలిచ్చారు. అదే అక్కడికీ, ఇక్కడికీ తేడా!

### అదే ప్లస్, మైనస్

అయితే అప్పటికీ, ఇప్పటికీ బాలీవుడ్‌లో చాలా మార్పు వచ్చింది. మహిళల కోసం ప్రత్యేకంగా కథలు రాస్తున్నారు. దక్షిణాదిలో ఇంకా ఆ దిశగా పెద్దగా ప్రయత్నాలు చేయడం లేదు. ఈ లెక్కన ప్రతి ఇండస్ట్రీలో ప్లస్సులు, మైనస్సులు ఉన్నాయి అంది. కాగా జ్యోతిక నటించిన సిస్టమ్ సినిమా మే 22న అమెజాన్ ప్రైమ్‌లో విడుదల కానుంది.



# కోలీవుడ్ కాలింగ్?

జాన్వీ కపూర్ కోలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రముఖ హీరో విక్రమ్ తనయుడు ధ్రువ్ విక్రమ్ హీరోగా కరణ్ అరవింద్ కుమార్ దర్శకత్వంలో ఓ సినిమాకి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ద్విభాషా (తమిళ,తెలుగు) చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్నారని సమాచారం. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు జాన్వీ కపూర్‌ను అను కుంటున్నారట. మరి... ఈ సినిమాతోనే జాన్వీ కోలీవుడ్ ఎంట్రీ ఉంటుందా? ధ్రువ్-జాన్వీల జోడీ కన్ఫార్మ్ అవుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మరోవైపు ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్రకు మేకర్స్ తొలుత రుక్మిణీ వసంత్‌ని అనుకున్నారట. కాల్షీట్స్ సర్దుబాటు చేయడంలో రుక్మిణీకి ఇబ్బందులు తలెత్తడంతో జాన్వీని తీసుకుంటున్నారని చెన్నై టాక్.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034